క్లుప్తంగా

రిజిస్ట్రార్ ఆఫీస్‌లో పోడియం తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్-1, రిజిస్ట్రార్-2 లకు ఉన్న పోడియంలను మంగళవారం తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర అధికారుల మాదిరిగానే రిజిస్ట్రార్ల కార్యాలయాల్లో కూర్చోవాలని ఆదేశాలు ఇవ్వటంతో పోడియంలను తొలగించారు. కార్యాలయంలో రిజిస్ట్రార్-1, రిజిస్ట్రార్-2లకు చెక్కతో చేసిన ఎత్తుగా పోడియంలు ఉండేవి. కోర్టులో జడ్జిల మాదిరిగా పోడియంలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పోడియంల తొలగింపునకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో వీటిని తొలగించి ఆ ప్రాంతంలో ఎత్తు దిమ్మను తొలగించి ఫ్లోరింగ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక అనఘాష్టమి వ్రతం

నాగాయలంక: స్థానిక ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న 67వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాల పందిరిలో 11వరోజు మంగళవారం మండల దత్తభక్త బృందం సౌజన్యంతో సామూహిక అనఘాష్టమి వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. శనగపల్లి వెంకట్రావు బ్రహ్మత్వంలో వేదికపై ప్రధాన కలశ పీఠం వద్ద జరిగిన పూజలో వల్లభనేని సాగర్, గాయత్రి దంపతులు పీటలపై కూర్చున్నారు. సామూహిక వ్రత పూజలో 60మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం డాక్టర్ కొత్తపల్లి నాగేశ్వరరావు ఆర్థికసౌజన్యంతో పాల రామాంజనేయులు (భామవరం) భాగవతార్ భక్త మార్కెండేయ హరికథ చెప్పారు.

అందరికీ సొంత గృహం ప్రభుత్వ లక్ష్యం



మోపిదేవి: అందరికీ సొంత గృహం కల్పించడమే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లక్ష్యమని అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండలంలోని మోపిదేవి, ఉత్తరచిరువోలులంక గ్రామాల్లో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన(గ్రామీణ) పథకం కింద నిర్మించిన 10 గృహాలలో నాలుగు గృహాలను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ సొంత ఇల్లు ఉండాలనే కలను ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. అనంతరం నూతన గృహాల ఎదుట మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత గృహిణిలకే అప్పగించారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీటీసీ కొమ్ము పవన్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, రావి రత్నగిరి, తహసీల్దార్ ఎం. శ్రీవిద్య, ఎంపీడీవో కె. శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ డీఈ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు 108 చీరలతో అలంకరణ

టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాలా పార్వతీ సమేత రామేశ్వరస్వామివారి దేవస్థానంలో భాద్రపద పౌర్ణమి సందర్భంగా మంగళవారం 108 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించిన అనంతరం అష్టోత్తర శత అలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలుగ్రామాల నుంచి వచ్చిన మహిళా భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

వరద బాధితులకు రూ.3.04లక్షలు విరాళం



అవనిగడ్డ: వరద బాధితుల సహాయార్థం స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థలు రూ.3,04,609 ఆర్థిక సహాయాన్ని అందించారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాల విద్యార్థులు సేకరించిన రూ.1,16,089, ఇంటర్ విద్యార్థులు సేకరించిన రూ.1,88,520 నగదుని విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు అందించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘంటసాల: ఘంటసాల ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణానాయక్ ఆదేశాల మేరకు ఘంటసాల విద్యుత్ సబ్ స్టేషన్లో కొత్త బ్రేకర్ల ఏర్పాటు, మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఘంటసాల, దేవరకోట, బొల్లపాడు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో వక్తలు

పెడన: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎవరో వస్తారు.. శుభ్రం చేస్తారని చూసే బదులుగా స్వచ్ఛందంగా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో కలిసి ఎమ్మెల్యే పచ్చజెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు బాబులాల్, కొసనం కరుణ కుమారి, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, టీడీపీ నాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లోను, ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కొన్ని చోట్ల ర్యాలీలు చేయగా, మరికొన్ని చోట్ల మానవహారం చేసి ఆకట్టుకున్నారు.

అవగాహన అవసరం..

నాగాయలంక: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని నాగాయలంక ఎంపీడీఓ జె.కె. సీతారామ్ కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీ వరకు మండలంలో నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. తొలుత నాగాయలంక ప్రధాన మార్గంలో స్వచ్ఛతాహీ సేవ ప్రదర్శన జరిపారు. అనంతరం ట్రాఫిక్ ఐల్యాండ్ ప్రధాన కూడలిలో వివిధ శాఖల ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు మానవహారం నిర్మించారు. బహిరంగ మలవిసర్జన మనిషి మనుగడకే చేటు అంటూ పలు స్వచ్ఛత నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. మండల పంచాయతీల విస్తరణాధికారి కె.అప్పలనరసమ్మ, సర్పంచ్ కై తేపల్లి అంకాలు, గ్రామ కార్యదర్శి జేహెచ్‌వీ పవన్ కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి..

ఘంటసాల: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వభావ స్వచ్ఛత – సంస్కార స్వచ్ఛత కార్యక్రమాన్ని ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో ఎంపీడీవో శ్రీనివాస చంద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్లోని విద్యార్థులతో మానవహారం నిర్మించారు. అలాగే ఘంటసాల మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం పరిసరాలను ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఎంఈవో-2 ఎండీ మోమిన్, ఈవో టి.విజయ లక్ష్మి పాల్గొన్నారు. అలాగే ఘంటసాలపాలెం పంచాయతీ వద్ద విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసిన అధికారులు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ దోనె రజనీ, ఈవో బి.అర్జునరావు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న బందరు నగరపాలక సంస్థ సిబ్బంది, ప్రజాప్రతినిధులు



ఘంటసాల మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

అవగాహన ర్యాలీ..

కోడూరు: కేంద్ర ప్రభుత ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కోడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ప్రధాన సెంటర్ వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఫ్లెక్సీలు, ప్లకార్డులు పట్టుకొని పరిసరాల పరిశుభ్రత, మొక్కల నాటడంపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 2 జరిగే గాంధీ జయంతి వరకు ఈ పక్షోత్సవాలు జరుగుతాయని, ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొవాలని ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు కోరారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో ప్రతిజ్ఞ నిర్వహించారు. విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శులు సుధీర్, ఉదయ్‌లక్ష్మీ, ఏడుకొండలు, నాగార్జున, లీలా ప్రియాంక, తనూజ పాల్గొన్నారు.



పెడనలో స్వచ్ఛతా సేవా హీ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, చైర్‌పర్సన్ నాగకుమారి

బాల్యదశ నుంచే అవగాహన అవసరం

గూడూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని దీనిపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మండల కేంద్రమైన గూడూరులో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం గూడూరు సెంటరు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ డెక్కా రాజేశ్వరి, మాజీ డీసీ చైర్మన్ పోతన స్వామి పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ

మచిలీపట్నంటౌన్: నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోనేరుసెంటర్‌లో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు పర్యావరణాన్ని కాపాడుతామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జి. గోపీచంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ పాల్గొన్నారు.



విశ్వనాథపల్లిలో మొక్క నాటుతున్న ఎంపీపీ వెంకటకుమారి, విద్యార్థులు



నాగాయలంకలో జరిగిన స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

సుబ్బారాయుడి ఆలయంలో..

మోపిదేవి: రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, పెదకళ్లేపల్లి శ్రీదుర్గానాగేశ్వరస్వామివారి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివార్ల పూజా కార్యక్రమాలు ముగిసిన తరువాత ప్రధాన దేవస్థానం పరిసర ప్రాంతంలో ఆలయ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా చీపుర్లు పట్టి శుభ్రం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మోపిదేవి దేవస్థానంలో శుభ్రం చేస్తున్న ఆలయ సిబ్బంది

నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం



పటాన్‌పేట ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సురేష్



ఘంటసాల హైస్కూల్లో నులిపురుగుల నివారణ మందు వేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస చంద్

గూడూరు: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి నులిపురుగుల నిర్మూలన ఎంతో ఆవశ్యకమని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పటాన్‌పేటలోని మండల పరిషత్ పాఠశాలలోని చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసిన జెడ్పీటీసీ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల చిన్నారులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పర్యావసానంగా విద్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం 17 ఏళ్లలోపు బాలబాలికలకు ప్రతి 6నెలలకు ఒకసారి ఉచితంగా ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల: నేషనల్ డీ వార్మింగ్ డేను ఘంటసాల మండలంలో విజయవంతంగా నిర్వహించినట్లు ఘంటసాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1 నుంచి 19 ఏళ్ల లోపు వారు 1174 మంది ఉండగా 1147 మందికి నులిపురుగుల నివారణ మందులను అందించామని చెప్పారు. ఘంటసాల, ఘంటసాలపాలెం, శ్రీకాకుళం పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్స్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి నులిపురుగుల నివారణ మందులను ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు చేతుల మీదగా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఘంటసాల హైస్కూల్లో ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్, ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, సర్పంచ్ డి.వెంకటేశ్వరమ్మ, కొడాలి హైస్కూల్లో సర్పంచ్ రాణి, ఘంటసాలపాలెంలో సర్పంచ్ దోనె రజనీ మందును పంపిణీ చేయగా ఆయా కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

12,239 మందికి మాత్రల పంపిణీ..

పెడన: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా మంగళవారం నులిపురుగుల మాత్రలను పాఠశాలల్లో పంపిణీ చేశారు. యూపీహెచ్‌సీ, పెడన పీహెచ్‌సీ, చేవేంద్ర పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారుల పర్యవేక్షణలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వారితో మింగించారు. వైద్యాధికారులు పర్వేజ్‌హైదర్, మీనాక్షీదేవి, ప్రదీప్‌కుమార్, సాయిరమ్య, సాయిప్రీతి పర్యవేక్షించారు.

ఇసుక అక్రమంగా తరలించిన వ్యక్తికి జరిమాన

మోపిదేవి: మండలంలోని నాగాయితిప్ప నుంచి మోపిదేవికి తరలిస్తున్న అక్రమ ఇసుక ట్రాక్టర్ యజమానికి తహసీల్దార్ శ్రీవిద్య రూ. 5 వేలు జరిమానా విధించారు. మంగళవారం ఉదయం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న స్థానిక పోలీసులు తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు. వరదకు ముందుగా నాగాయితిప్పలో స్టాక్ చేసుకున్న ఇసుకనే ఇంటికి తరలిస్తున్నట్లు ట్రాక్టర్ యజమాని పెద్దిబోయిన రామగోపీ చెప్పడంతో తొలి తప్పుగా భావించి ఈ జరిమానా విధించినట్లు తహసీల్దార్ శ్రీ విద్య వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఘంటసాల: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల్లో సాగు చేసే విధానం, ప్రయోజనాల గురించి మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి పార్థసారథి మాట్లాడుతూ వివిధ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఉపయోగాలు వివరించారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త వి.మంజువాణి ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, కోడిగుడ్డ, నిమ్మరసం ద్రావణం తయారీని నైపుణ్య ప్రదర్శన చేయించారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో శాస్త్రవేత్తలు ఏక్ పేడ్ మా కే నామ్ అని ప్రతి ఒక్కరూ వారి మాతృమూర్తికి గుర్తుగా ఒక మొక్క నాటారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

డీఎఫ్‌సీఎస్ డైరెక్టర్ పదవికి కర్రి కృష్ణమూర్తి నామినేషన్

నాగాయలంక: కృష్ణాజిల్లా మత్స్యకారుల సహకార సంఘం డైరెక్టర్ పదవికి ఈనెల 24న జరగనున్న ఎన్నికలలో తాను నామినేషన్ సమర్పించినట్లు స్థానిక మత్స్యకారుల మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి చెప్పారు. ఈ మేరకు మచిలీపట్నంలోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల అధికారి డి.వి జయకుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశానన్నారు. ఆయన వెంట మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు, విశ్వనాథపల్లి పాండు బందరు వెళ్లారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి జి. రమేష్ మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని జరపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఈ వేడుకలను నిర్వహించామన్నారు. మచిలీపట్నం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మానేపల్లి బ్రాహ్మజీ తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి

మచిలీపట్నంటౌన్: శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతిని నగరంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వీవీఎస్ కల్యాణమండపంలో వైఎస్సార్ సీపీ సుతారి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో జగత్ సృష్టికర్త శ్రీ విశ్వకర్మ భగవానుడికి పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), కార్పొరేటర్ మేకల సుబ్బన్న హాజరయ్యారు. అలాగే శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. స్వర్ణకార జెండాను స్వర్ణకారుల సంఘం నాయకుడు గడ్డం రాజు ఆవిష్కరించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న పేర్ని కిట్టు తదితరులు

ఘనంగా విశ్వకర్మ జయంతి..

కృత్తివెన్ను: మండల పరిధిలోని పోడు గ్రామంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా విశ్వకర్మ జయంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా బోధన

శ్రీకాకుళం (ఘంటసాల): విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఏపీ రాష్ట్ర సమగ్ర శిక్ష ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ ప్రొఫెసర్ కేఆర్ఎం ప్రతిష్ట అన్నారు.

ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్లో మంగళ, బుధవారాలు నిర్వహిస్తున్న శ్రీకాకుళం, గోగినేనిపాలెం హైస్కూల్స్ పరిధిలోని 15 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతిష్ట మాట్లాడుతూ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ వివరాలను, ఆవశ్యకతను ఉపాధ్యాయులకు వివరించారు. మండల విద్యాశాఖ అధికారి-2 ఎండీ మోమిన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు గోగినేనిపాలెం, శ్రీకాకుళం కాంప్లెక్స్ సీఆర్పీలు నిరీక్షణరావు, శ్రీహరి పాల్గొన్నారు.

నైపుణ్యాలతో కూడిన విద్యాబోధన అవసరం

పెడన: విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యాబోధన అవసరం ఎంతైనా ఉందని సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి టి.నగేష్ అన్నారు. పెడన మండలంలోని వివిధ పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమగ్ర శిక్ష జిల్లా సెలక్టోరల్ అధికారులు టి.నగేష్, ఒ.రామకృష్ణ, జి.సీతామహాలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు స్కూల్ కాంప్లెక్స్‌కు హాజరవ్వడం వల్ల బోధనలో మెలకువలను, ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవచ్చన్నారు. ఎంఈఓ-2 వై.వి. హరనాథ్, ఎస్.సౌజన్య, వి.విజయకుమారి, తీర్థవతి, హిదాయతున్నీసా, ఏ.ఆర్.అస్లం తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న నగేష్

ఉత్సాహంగా వినాయక నిమజ్జనాలు



బీచ్ వద్ద గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



వేదికపై ఉత్సవ వినాయకుని చెంత ద్వాదశ హారతుల్లో నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు

మచిలీపట్నంటౌన్: వినాయకచవితి నవరాత్రి మహోత్సవాలు ముగియటంతో స్వామివారి విగ్రహాలు ఊరేగింపు, నిమజ్జనాల కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. నగరంలోని పలు పందిళ్లలో కొలువుతీరిన గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై నగరంలోని నాగులేరు కాలువ, మంగినపూడి బీచ్‌కు తరలించారు.

నాగాయలంక: స్థానిక ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న 67వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలలో మంగళవారం రాత్రి ఉత్సవ వేదికపై ప్రసన్న గణపతికి ద్వాదశ హారతులు దేదీప్యమానంగా ప్రజ్వలించాయి. ఆలయ అర్చకుడు అంబాసాయి తొలుత స్వామివారికి ద్వాదశ హారతులు జరిపిన మీదట ఉత్సవ పందిరిలో మహిళలు దీప ప్రమిదలను చేతబూని సామూహికంగా వేదమంత్రాలకు అనుగుణంగా తిప్పడం నేత్రపర్వంగా వెలుగులు జిమ్మింది. అనంతరం మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు.

కోడూరు: గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను భక్తులు నిమజ్జనానికి తరలిస్తున్నారు. మంగళవారం మండలంలోని స్వతంత్రపురం, లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి, జరుగువానిపాలెం గ్రామాల్లోని గణనాథుల విగ్రహాలను డప్పువాయిద్యాలు నడుమ ఉల్లిపాలెంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేసి, పుణ్యస్నానాలు ఆచరించారు.



వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: స్థానిక ఆరోవార్డులో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ గణపతి స్వామి పందిరిలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి) ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ యువనేత సింహాద్రి వికాస్ పాల్గొన్నారు. భారీ ఊరేగింపుతో తరలివెళ్లిన విగ్రహాన్ని పులిగడ్డ వార్పు వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

పొలాల్లో బుసక మేట తొలగించండి



ఘంటసాల: ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా పంటలు పండించే లంక భూముల్లో బుసక మేట వేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. దానిని తొలగించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆది ఆంధ్ర లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు మంగళవారం అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఘంటసాల మండలం పాపవినాశనం ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 438 మంది లంక భూముల్లో పండించే పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరద నీరు రావడంతో తమ లంక భూములు మునిగిపోవడంతో పాటు భూముల్లో వేసిన పట్టు పురుగుల షెడ్లు, మినుము, పసుపు, మొక్కజొన్న పైరులు నాశనమయ్యాయన్నారు. వరద తగ్గడంతో మరలా పంటలు వేసుకుందామని ప్రయత్నిస్తే బుసక మేట వేయడంతో పంటలు పండే పరిస్థితి కనబడటం లేదన్నారు. దీంతో బుసకను తొలగించేందుకు అనుమతి ఇప్పించాలని విన్నవించారు. సొసైటీ ప్రెసిడెంట్ బుర్రే ఏసు, మునిపల్లి బుజ్జి, కుంపటి చిట్టి బాబు, కందెల భాస్కరరావు, బుర్రే చిన్నబుజ్జి, కుంపటి ఆనందరావు, మునిపల్లి రమేష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com